


కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ (ఫైల్)

పరిష్కారం ఎప్పుడో..!?

జిల్లాలో గ్రీవెన్స్‌సెల్‌లో 1,455 దరఖాస్తుల పెండింగ్

- కాలయాపనతో.. బాధితుల నిరీక్షణ
- ఎదురు చూసి.. ఫిర్యాదులు పునరావృతం
- వెంటనే చొరవ చూపాలని విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, జనవరి 31 : గ్రామ, మండలస్థాయిల్లో పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలపై.. జిల్లా గ్రీవెన్స్‌లో దొరుకుతుందన్న ఆశతో ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. కొన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుండగా, మరికొన్ని పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో నిరీక్షించి, ఫిర్యాదుదారులు మళ్లీమళ్లీ దరఖాస్తులు ఇస్తున్నారు. మానుకోట జిల్లా కేంద్రం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావించిన ప్రజలుకు పలు అర్జీలు పెండింగ్‌లో ఉండడంతో వారు నిరాశకు లోనవుతున్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను కలెక్టర్లు పరిశీలించి, ఆయాశాఖలకు పంపించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించినప్పటికి, అవి అపరిష్కృతంగా ఉంటున్నాయి. ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి, తమకు న్యాయం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలో 1,455 దరఖాస్తులు పెండింగ్...

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో అనేక సం వత్సరాల నుంచి గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహిస్తూ వస్తోంది. ఉమ్మడి జిల్లా కేంద్రాలు దూర భారంగా ఉండడంతో సమస్యలపై ఫిర్యాదులిచ్చేందుకు అప్పట్లో గీవెన్స్‌సెల్‌కు తక్కువగా వెళ్లేవారు. 2014లో స్వరాష్ట్రం సిద్ధించాక పరిపాలన సౌలభ్యం కోసం 2016 అక్టోబరు 11న కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి, ప్రతీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లలో గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో 17 అక్టోబర్ 2016 నుంచి గ్రీవెన్స్‌సెల్‌ను ప్రారంభించారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చి, వారు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. కొన్ని సమస్యలకు పరిష్కారం లభించగా, మరికొన్నింటికి మాత్రం మోక్షం దొరకడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు వివిధ శాఖలకు సంబంధించి 11,289 దరఖాస్తులు రాగా, అందులో 9,834 పరిష్కారం కాగా, 1455 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రీవెన్స్‌లో కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినప్పటికి కొన్ని దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దరఖాస్తులు పరిష్కారం కాకుండా ఎందుకు కాలేదో 15 రోజుల్లో ఫిర్యాదు దారులకు తెలియజేయాల్సి ఉంటుంది. అలా చేయకపోవడంతో ఫిర్యాదు దారులు ఒక్క సమస్యపైనే మళ్లీమళ్లీ గ్రీవెన్స్‌లో దరఖాస్తులు ఇస్తున్నారు.

ఏఏ శాఖల్లో పెండింగ్‌లున్నాయంటే..

మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఇప్పటి వరకు మొత్తంగా 11289 దరఖాస్తులు రాగా అందులో 9834 పరిష్కారం అయ్యాయి. మిగిలిన 1455 పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ఉండడం విశేషం. అటవీ శాఖ 71, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ 35, విద్యుత్ శాఖ 38, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ 45, లీడ్ బ్యాంక్ మేనేజర్ 34, మిషన్ భగీరథ 12, మహబూబాబాద్ మునిసిపల్ కమిషనర్ 50, తొర్రూరు మునిసిపల్ కార్యాలయం 31, మానుకోట ఆర్డీవో కార్యాలయం 77, తొర్రూరు ఆర్డీవో ఆఫీస్ 29, సర్వేఅండ్‌ల్యాండ్ రికార్డ్స్ 57, జిల్లా పోలీస్ కార్యాలయం 34, బయ్యారం తహసీల్దార్ కార్యాలయం 38, చిన్నగూడూరు తహీల్దార్ కార్యాలయం 29, గూడూరు తహసీల్దార్ కార్యాలయం 26, ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయం 63, కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం 101, మహబూబాబాద్ తహసీల్దార్ ఆఫీస్ 110, మరిపెడ తహసీల్దార్ ఆఫీసు 40, కురవి తహసీల్దార్ ఆఫీసుకు 51, ఉమెన్ అండ్ చిల్డ్రన్ డిసెబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్ శాఖకు సంబంధించి 24, జిల్లా ఆస్పత్రికి సంబంధించి 15 దరఖాస్తులు, బీసీ సంక్షేమశాఖ 20, జిల్లా విద్యాశాఖకు సంబంధించిన 18 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలి..



బోడ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ ఇస్లావత్ తండా (సి), మహబూబాబాద్ మండలం

గ్రీవెన్స్‌పై ఎంతో నమ్మకంతో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కారం చూపాలి. సింగారం గ్రామశివారు ఇస్లావత్‌తండా నుంచి వెంకట్రాం తండా వరకు రోడ్డును మంజూరు చేయాలని గ్రీవెన్స్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశాను. రెండు తండాల నడుమ రోడ్డు మంజూరు కోసం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా పూర్వ కలెక్టర్ సర్వే చేయాలని అధికారులకు సూచించినప్పటికి ఇంత వరకు అతిగతి లేదు. దీంతో మళ్లీ దరఖాస్తును ఇవ్వాల్సి వస్తోంది.

భూ సమస్య విషయంలో దరఖాస్తు చేశా..



షేక్.జబ్బార్ మియా, బేతోలు

భూ సమస్య విషయంలో గ్రీవెన్స్‌లో రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నాను. బేతోలు గ్రామంలోని ఎర్రకుంట చెరువు కింద తాను 2019 ఎకరంపొలం కొనుగోలు చేశాను. అమ్మిన సమయంలో దానికి దారి ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ చేశారు. ఇప్పుడు పొలానికి వెళ్లే దారిని దున్ని వరినాట్లు వేస్తున్నారు. దీంతో తన పొలానికి దారి లేకుండా అవుతోంది. ఈ విషయంపై గ్రీవెన్స్‌లో రెండుసార్లు ఫిర్యాదు చేశాను. జిల్లా అధికారులు చొరవచూపి తనకు న్యాయం చేయాలి.

'పంట వివరాలను నమోదు చేయాలి'

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 31 : జిల్లాలో యాసంగిలో వేసే ప్రతీ పంటతో పాటు అయిల్‌పామ్ తోటల వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ కోరారు. మహబూబా బాద్‌లోని రైతువేదికలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ పంటను క్రాప్‌బుకింగ్ యాప్‌లో నమోదు చేయాలని, పండ్ల తోటలు, కూరగాయలను, ఆయిల్‌పామ్ సాగులో ఉన్న ప్రతీ ఎకరాన్ని కూడా నమోదు చే యాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరిపెడ ఏడీఏ కె.శోభన్‌బాబు, టెక్నికల్ ఏడీఏ వి.రాజనరేందర్, ఏవోలు సారయ్య, తిరుపతిరెడ్డి, ఇతర వ్యవసాయాధికారులు, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారులు, రైల్వే మూడోలైన్, దేవాదుల ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతలు, ఎస్సారెస్పీ రెండోస్టేజ్ పనుల ప్రగతిపై మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 163జీ వరంగల్ నుంచి ఖమ్మం వరకు, 365ఏ కురవి నుంచి ఖమ్మం వరకు, 930పీ తొర్రూరు నుంచి బయ్యారం నెహ్రూనగర్ వరకు జాతీయ రహదారి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సదరు జాతీయ రహదారుల పనులు, రైల్వే మూడోలైన్‌కు భూసేకరణ, నష్ట పరిహారం, కురవి, గార్ల మండలాల ఆర్వోబీ పనులు, నీటి పారుదల శాఖద్వారా పెద్దవంగర మండలం పోచంపల్లిలో చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం, 14వ ప్యాకెజీ కింద చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం పనులు, ఎస్సారెస్పీ సెకండ్‌స్టేజీ పనుల్లో భూసేకరణ పూర్తి చేసి నష్ట పరిహారం త్వరితగతిన పంపిణీ చేయాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, మానుకోట, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, జిల్లా అధికారులు తానేశ్వర్, యుగందర్, వెంకన్న, ఫిరోజ్ పాల్గొన్నారు.

కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ద్వారా ఎక్స్‌గ్రేషియో

సహాయక కార్మిక కమిషనర్ జగదీష్

మహబూబాబాద్ టౌన్, జనవరి 31 : అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ ఈ-శ్రమ్‌పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ప్రమాదవశాత్తు చనిపోయిన, శాశ్వత అంగవైకల్యం పొందిన కార్మికులకు కేంద్రకార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ ఎక్స్‌గ్రేషియో అందిస్తుందని జిల్లా కార్మికశాఖ కమిషనర్ జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 26 ఆగస్టు 2021 నుంచి 31 మార్చి 2022 మధ్య ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ప్రమాదవశాత్తు చనిపోయినా లేక శాశ్వత అంగవైకల్యం పొందిన అసంఘటిత కార్మికులకు లేదా నామినిలకు ఎక్స్‌గ్రేషియో కేంద్రప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. మరణించిన కార్మికుల నామినిలకు రూ.2 లక్షలు, అంగవైకల్యం పొందిన కార్మికుడికి రూ.లక్ష అందిస్తుందన్నారు. జిల్లాలోని అర్హులైన అసంఘటిత కార్మికులు ఫిబ్రవరి 12 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తుతోపాటు మరణధ్రువపత్రం, ఆధార్, ఈ-శ్రమ్‌కార్డు, ఎఫ్ఐఆర్ పంచనామా పోస్టుమార్టం రిపోర్టు, నామిని బ్యాంక్ అకౌంట్ వివరాలు జతచేసి జిలాల్ల కలెక్టరేట్‌లోని సహాయక కార్మిక కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి

మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 31 : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 12న వైద్యశాఖ ఆధ్వర్యంలో డీవార్మింగ్ (అల్బెండజోల్) మాత్రలు పంపిణీ జరుగుతుందని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో బుధవారం నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా అల్బెండజోల్ మాత్రలు వేయించాలని చెప్పారు. ఈనెల 19న మిగిలిన పిల్లలకు మాత్రలు వేయించాలని తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రసన్నారాణి, మెప్మా డీఎంసీ విజయ, వార్డు కౌన్సిలర్లు పోతు రాజు రాజు, మార్నేని శ్రీదేవి, కోఆప్షన్ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దండె శ్రీహరి పాల్గొన్నారు.

'సదరం కోసం స్లాట్ బుకింగ్ ప్రారంభం'

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందడానికి గురువారం నుంచి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కొత్తగా సర్టిఫికెట్ పొందాలనుకునే వారు ఆయా మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్‌ల ద్వారా వైకల్య నిర్ధారణ పరీక్ష చేయించుకుని, సదరు పత్రంతో మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ కాలపరిమితి ముగిసిన వారు రెన్యూవల్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని ఆయన వివరించారు.

12న గార్ల ఎంపీపీ ఎన్నిక

మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు

గార్ల, జనవరి 31 : మండల పరిషత్ అధ్యక్షుడి ఎన్నికను ఈనెల 12వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు తెలిపారు. గార్ల తహసీల్దార్ కార్యాయలంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లా డారు. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా డిసెంబర్ 22 ఎంపీపీ మూడ్ శివాజీ చౌహాన్‌నాయక్‌పై మెజార్టీ ఎంపీటీసీలు ఆర్డీవో అలివేలు అవిశ్వాస తీర్మానంపై నోటీసులు అందజేశారు. దీంతో డిసెంబర్ 23న ఎంపీపీ తన పదవికి రాజీనామా చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తిరిగి ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని ఆర్డీవో కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి..

- ప్రధాని మోదీ గ్యాంగ్‌స్టార్‌లా వ్యవహరిస్తున్నారు..
- మా పోరాటం కార్పొరేట్, మతోన్మాదం మీదనే..
- సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో బహిరంగసభ
- నేటి నుంచి జాతీయ సమావేశాలు


సభలో అభివాదం చేస్తున్న నాయకులు

హనుమకొండ క్రైం, జనవరి 31: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తు చిత్తుగా ఓడించాలని, కార్మిక, కర్షకులు ఒక్కటై ప్రధాని మోదీని గద్దె దించాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి తపన్‌సేన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు ఆల్‌ఇండియా సీఐటీయూ వర్కింగ్ కమిటీ సమావేశాలు కాజీపేటలో జరగనున్నాయి. ఈ సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో జిల్లా నాయకుడు ఉప్పలయ్య అధ్యక్షతన బుధవారం బహిరంగసభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన తపన్‌సేన్ హాజరై ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో మత విద్వేషాలు రేపుతూ ప్రజల్లో చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. బీజేపీ మతరాజకీయాల వల్ల ప్రజలు సంక్షోభంలో కూరుకుపోతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వారి హక్కులను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. కార్మిక కోడ్‌లను తీసుకువచ్చి యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. తమ పోరాటం కార్పొరేట్, మతోన్మాద శక్తులపైనే అని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ గ్యాంగ్‌స్టార్‌లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటీవల దేశంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు చేసిన సమ్మె అభినందనీయమని కొనియాడారు. ఫాసిస్టు విధానాలు విజయాలు సాధించిన దాఖలాలు దేశంలో ఎన్నడూ లేవని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 యేళ్లు గడుస్తున్నా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ మతాన్ని రాజకీయంతో మిళితం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు బీజేపీ కపట నాటకాలను గమనిస్తున్నారని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మించి మోదీ ప్రశ్నించే ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర చేస్తున్నాడని అన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త భారత్‌బంద్‌ను ప్రజలు విజయవంతం చేయాలని తపన్‌సేన్ పిలుపునిచ్చారు.

సీఐటీయూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు మాట్లాడుతూ.. బీజేపీని ఓడించకపోతే హక్కులుండవని, ఆ పార్టీని ఓడించడమే ప్రజల కర్తవ్యం కావాలని చెప్పారు. మోదీ ప్రధాని అయిన తర్వాత రాజ్యాంగానికి, హక్కుల కు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే కవులు

మిగతా 8వ పేజీలో

23న మేడారానికి సీఎం రాక

వనదేవతలను దర్శించుకోనున్న రేవంత్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జనవరి 31 : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఈనెల 23న మేడారానికి రానున్నారు. 21 నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరక్రమంలో ఆయన వస్తున్నారు. 23న మేడారానికి వచ్చి సమ్మక్క-సారలమ్మను దర్శించుకోనున్నారు. జాతర నిర్వహణ, విధుల సమీక్షలో ఉన్న వరంగల్ ఉమ్మడి జిల్లాల అధికారయంత్రాంగం ముఖ్యమంత్రి రావడం ఖరారైన క్రమంలో చేపట్టాల్సిన చర్యలను సమీక్షిస్తున్నారు.

నేడు మానుకోటకు మంత్రి పొంగులేటి రాక



మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు

మహబూబాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాల్లో నిర్వహించే పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొంటారని చెప్పారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో మధ్యాహ్నం 2గంటలకు మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం ఉంటుందని, ఇందులో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పాల్గొంటారని చెప్పారు. మరిపెడ మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్స్‌లో మధ్యాహ్నం 3గంటలకు డోర్నకల్ నియోజకవర్గ సన్నాహక సమావేశం ఉంటుందని, ఇందులో మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌జాటోతు రాంచంద్రు నాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగే సన్నాహక సమావేశాలకు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల నేతలతో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రేపటి నుంచి ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు చెక్‌పవర్

నేటితో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం

మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : జిల్లాలోని 18 మండలాల పరిధిలో 461 గ్రామపంచాయతీలకు రాష్ట్రప్రభు త్వం ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు చెక్‌పవర్‌ను కల్పించినట్లు బుధవారం డీపీవో హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచుల పదవీకాలం గురువారంతో ముగియనున్న నేపథ్యంలో.. ఈనెల 2 నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. ప్రస్తుతం సర్పంచ్, ఉపసర్పంచ్‌ల వద్ద ఉన్న జాయింట్ చెక్‌పవర్‌ను రద్దుచేసి ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు చెక్‌పవర్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. సర్పంచుల వద్ద ఉన్న చెక్‌బుక్‌లు, రికార్డులు, మినిట్స్ బుక్‌ను ఇతరత్రా వంటి రికార్డులను పంచాయతీ కార్యదర్శులు స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్



మహబూబాబాద్ రూరల్, జనవరి 31 : జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కరదశకు తీసుకురావాలన్నారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులపై సమీక్షించారు. మిస్సింగ్ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలన్నారు. చార్జ్‌షీట్లు, సామాన్లు, నాన్‌బెయిల్ వారెంట్‌లను పెండింగ్‌లో ఉంచకుండ చూడాలన్నారు. న్యాయస్థానంలో తగిన సాక్షాధారాలను ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అన్ని ఆధారాలు సేకరించి చార్జ్‌షీట్‌ను దాఖలు చేయాలన్నారు. పోక్సో, అత్యాచార కేసుల్లో దర్యాప్తు వేగం పెంచాలన్నారు. గంజాయి వంటి నిషేదిత మాదకద్రవ్యాలను రవాణా, విక్రయించే వారిపై పీడీయాక్టు కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, పర్యవేక్షించాలన్నారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు తీర్థాల సత్యనారాయణ, వెంకటేశ్వరబాబు, విజయ్‌ప్రతాప్, సీఐలు బాలాజీవరప్రసాద్, శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు, జనవరి 31: పోలీసు ఉద్యోగం రాలేదని మనస్థాపంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జనవరి 13న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి రమ - సారంగం దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు శ్రీకాంత్ (25) అనే యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. హైదరాబాద్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ పడింది. ఈ పరీక్షకు కూడా హాజరయ్యాడు. ఫిజికల్ టెస్టులన్నీ పాస్ అయ్యాడు. లిఖిత పరీక్షలో రెండు మార్కులు తగ్గడంతో శ్రీకాంత్ ఉద్యోగానికి ఎంపిక కాలేక పోయాడు. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్న శ్రీకాంత్‌ను తల్లిదండ్రులు ఓదార్చే ప్రయత్నం చేశారు. ఉద్యోగం రానందుకు బాధపడాల్సిన అవసరం లేదని, తమతో పాటు వ్యవసాయం చేసుకొని బతకొచ్చని ధైర్యం చెప్పారు. అయినా మానసికంగా కుంగిపోయిన శ్రీకాంత్.. ఆ వేదన నుంచి బయటకు రాలేకపోయాడు. జనవరి 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందుతాగాడు. చుట్టుపక్కలవారు చూసి ఆయనను వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చెట్టంత కొడుకు దూరమైనందుకు తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. మృతుడు అవివాహితుడు. శ్రీకాంత్ మృతితో నీరుకుల్ల గ్రామంలో విషాదం నెలకొన్నది.



శ్రీకాంత్(ఫైల్)

నేటి నుంచి గ్రూప్స్ ఉచిత శిక్షణ ప్రారంభం

హనుమకొండ రూరల్, జనవరి 31: గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులకు ఈనెల 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారిలో 100 మందిని ఎంపిక చేశామన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ చలాన్ల గడువు పొడగింపు

హనుమకొండ క్రైం, జనవరి 31: పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై రాయితీతో చెల్లించే గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయించిందని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విధించిన గడువు జనవరి 31తో ముగియడంతో ప్రజల అవసరాల నిమిత్తం ఫిబ్రవరి 15 వర కు పొడిగిస్తూ మార్గదర్శకాలను విడుదల చేసిందని పేర్కొన్నారు. డిసెంబరు 25 వరకు ఉన్న చలాన్లు మాత్రమే ఈరాయితీకి వర్తిస్తుందని తెలిపారు. ద్విచక్రవాహనాలకు, ఆటోలకు 80శాతం, ఆర్టీసీ బస్సులకు 90శాతం, ఇతర వాహనాలకు 60శాతం రాయితీలో చలాన్లను చెల్లించవచ్చని సీపీ సూచించారు.

5 నుంచి ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 31: కేయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు అమె పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 5, 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాలన్నారు.

ఖిలాషాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు


పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

హనుమకొండ క్రైం, జనవరి 31: జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం ఖిలాషాపూర్‌లో బుధవారం బెల్టు షాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులలో రూ.23 వేల విలువ గల వివిధ రకాల బ్రాండ్లకు సంబందించిన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన చెవ్వ అంజయ్య అనే వ్యక్తి చాలారోజులుగా తన ఇంటినే అడ్డాగా చేసుకుని అనుమతి లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించి పెద్దఎత్తున మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 23వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని రఘునాథపల్లి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నోట.. ట్రైబల్ వర్సిటీ మాట..

సమ్మక్క సారలమ్మ పేరిట ఏర్పాటు చేస్తున్నామంటూ వెల్లడి ● పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ద్రౌపది ముర్ము ప్రసంగంలో ప్రస్తావన


ములుగులో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంకోసం కేటాయించిన స్థలం

ములుగు, జనవరి 31: జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు భారీ ముందడుగు పడింది. బుధవారం జరిగిన పార్లమెంట్ బడ్జెట్ ప్రారంభ సమావేశంలో ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యూనివర్సిటీ అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో సమ్మక్క, సారలమ్మ పేరిట గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే క్రమంలో గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండగా యూనివర్సిటీపై ఆశలు రేకెత్తుతున్నాయి. కేటాయింపులు ఏమేరకు ఉంటాయోననే ఆసక్తి నెలకొంది.

వడివడిగా అడుగులు

ఏపీ పునర్విభజన చట్టం 2014లో తెలంగాణకు కేటాయించిన గిరిజన యూనివర్సిటీపై ఇటీవలే ఆశించిన స్థాయిలో కదలిక కనిపించింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ వర్సిటీపై ప్రకటన చేశారు. మహబూబ్‌నగర్‌లో అక్టోబరు 1న జరిగిన బహిరంగ సభలో గిరిజనుల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మ పేరిట జాతీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేస్తామని, ఇందుకు ములుగు ప్రాంతంలో స్థల సేకరణ కూడా జరిగిందని తెలిపారు. ఆతర్వాత యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియ ఊపందుకుంది. యూనివర్సిటీల చట్టసవరణ బిల్లులో ట్రైబల్ వర్సిటీని కూడా చేర్చగా గత ఏడాది డిసెంబరు 7న పార్లమెంటులో, డిసెంబరు 13న రాజ్యసభలో ఆమోదం పొందింది. అదే నెల 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. జనవరి 16న హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ అధికారుల బృందం ములుగు సమీపంలోని గట్టమ్మ వద్ద యూనివర్సిటీ కోసం కేటాయించిన 335 ఎకరాల స్థలాన్ని పరిశీలించింది. వీసీ బి.జె.రావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్ స్థలంతోపాటు తరగతుల నిర్వహణ కోసం జాకారం వద్దగల ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనాలను పరిశీలించారు. తాజాగా 24 తేదీన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ యూనివర్సిటీ, హెచ్‌సీయూ అధికారులతో కలిసి మరోసారి స్థలాన్ని, జాకారం వైటీసీ భవనాలను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్లు జరిగే అవకాశముందని వెల్లడించారు.


తాత్కాలిక క్యాంపస్ నిర్వహణకోసం ఎంపికచేసిన జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్

కేటాయింపుపై ఆసక్తి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాని ప్రకటన, తాజాగా పార్లమెంటు ఎన్నికల ముందు రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావన ఈ రెండు సందర్భాలను పలువురు రాజకీయ కోణంలో చూస్తున్నప్పటికీ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కలిసొచ్చిన సమయమని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్థల కేటాయింపు అంశాన్ని రాష్ట్రానికి అప్పగించి యూనివర్సిటీ స్థాపనకు అయ్యే పూర్తి ఖర్చు బాధ్యతను స్వీకరించింది. నిర్మాణం కోసం రూ.889 కోట్లను కేటాయించే అవకాశముందని ఇటీవల ప్రకటన కూడా వచ్చింది. అయితే ప్రస్తుతం జరిగే బడ్జెట్ సమావేశాలు చివరివి కావడంతో ఏ మేరకు కేటాయింపులు జరుగుతాయోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది. కేటాయించిన నిధులను విడుదలచేసి శంకుస్థాపన చేయాలని, సత్వరమే పనులు కూడా మొదలు పెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పత్తి రైతులకు సీసీఐ భరోసా

వరంగల్‌టౌన్, జనవరి31: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లను జనవరి 31 నుంచి నిలిపివేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజంలేదని, పత్తి కొనుగోళ్లను కొనసాగిస్తుందని సీసీఐ వరంగల్ బ్రాంచ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అర్జున్ ఎస్.దవే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన పత్తి పంటకు మద్దతు ధర కల్పించేందుకు సమీపంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పత్తి రైతులు ఎవరూ నిరాశ చెందకుండా తమ పత్తిని సీసీఐ కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సీసీఐ వెబ్‌సైట్. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. సీవోటీసీవోఆర్‌పీ.ఓఆర్‌జీ. ఇన్‌ను సంప్రదించవచ్చునని, లేదా కాట్-అల్లీ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

విద్యుదాఘాతంతో గాయాలు

కొత్తగూడ, జనవరి31: విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలైన సంఘటన మండలంలోని వేలుబెల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ప్రకారం వేలుబెల్లి గ్రామానికి చెందిన మురహరి రవికుమార్ కుమారుడు మంగళవారం చాణక్య ఇంటి డాబాపైకి వెళ్లి బస్తాలు తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి గాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్సకోసం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

దొంగల చేతివాటం

మేడారం, జనవరి 31: మేడారంలో దొంగల చేతివాటం పరిపాటిగా మారింది. వనదేవతలకు ముందస్తు మొక్కలు చెల్లించుకోవడానికి మేడారం చేరుకున్న భక్తులు విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. బుధవారం సుమారు 10 మంది భక్తులు మొత్తం రూ.లక్షకు పైగా నగదు, రెండు తులాల బంగారాన్ని కోల్పోయారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. సీసీకెమెరాలను పరిశీలించినా పోలీసులకు దొంగల ఆచూకీ లభించలేదు.

వనదేవతలకు మొక్కులు

50 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు

మేడారం, జనవరి 31: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారమ్మలకు మొక్కుల చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆదివాసీ సంప్రదాయాలతో తల్లులను దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం శివసత్తుల పూనకాలు, డోలి వాయిద్యాల నడుమ సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ గద్దెల వద్దకు చేరుకునానరు. క్యూలైన్ల ద్వారా మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 50 వేల భక్తులు మేడారం వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పోలీసులు పకడ్బందీ చర్యలు

వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి తరలి వస్తున్న భక్తులు నేరుగా తల్లి గద్దెలను దర్శించుకునేలా పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సుమారు 50 వేల మంది తరలి రావడంతో గద్దెల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గేట్లు మూసివేయకుండా నేరుగా భక్తులు గద్దెలకు చేరుకొనేలా ఏర్పాట్లు చేయగా వారు దర్శనాలు చేసుకునేందుకు క్యూలైన్ల వద్ద పోలీసులు ఎంతో శ్రమపడాల్సి వచ్చింది.

500 మందితో ట్రాఫిక్ నియంత్రణ

వనదేవతలను దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారి వాహనాలతో మేడారం కిటకిటలాడింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. దారి పొడవునా 25 రూట్ మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి గస్తీ నిర్వహించారు. ఎస్పీ శబరీశ్ స్వయంగా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. పస్రా నుంచి మేడారం వరకు వాహనాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. భక్తులు నేరుగా గద్దెల సమీపానికి చేరుకునేలా వన్‌వే రూట్‌ను ఏర్పాటు చేశారు. ఊరట్టం క్రాస్ వద్ద భారీ గేట్లు చేసి వాహనాలను పార్కింగ్‌లోకి మళ్లించారు. జంపన్నవాగు ఒడ్డుపై నుంచి గద్దెల సమీపంలోని పార్కింగ్‌లకు వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు మొత్తం 500 మంది పోలీసు సిబ్బందితో పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు.


జంపన్నవాగులో పుణ్యస్నానాలు

కేయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ మల్లారెడ్డి

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రం ● పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహచారి ● ఇతర పదవుల్లో సైతం నియామకం


రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డికి, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రంకు, పరీక్షల నియంత్రణాధికారి నరసింహచారికి నియామక ఉత్తర్వులు ఇస్తున్న వీసీ రమేశ్, మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 31: కాకతీయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ పొందిన వారిని పదవుల్లో కొనసాగడంపై అభ్యంతరాలను వ్యక్తం చేసింది. దీంతో ఇప్పటికే రిటైర్డు అయిన ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు రిజిస్ట్రార్‌గా కొనసాగగా, పదవి నుంచి తప్పుకున్నట్లు అయింది. దీంతో పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ మల్లారెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి గణితశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అలాగే సైన్స్ విభాగం డీన్‌గానూ పనిచేస్తున్నారు. 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2010లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ కంపెనీతో రెండేళ్లపాటు పనిచేసి తైవాన్‌లో 5 ఏళ్లపాటు పోస్టు డాక్టరల్ డిగ్రీ పూర్తి చేశారు. 1998లో ఉస్మానియాలో పీహెచ్‌డీ పూర్తి చేయగా, సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ ఉత్తీర్ణత సాధించారు. సీఎస్ఐఆర్, యూజీసీ, డీఎస్‌టీ ప్రాజెక్టులను పూర్తిచేశారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి పర్యవేక్షణలో 16 మంది పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ఇంటర్నేషనల్, నేషన్ జర్నల్స్‌లో దాదాపు 100 పరిశోధన పత్రాలను ప్రచురించారు. వర్సిటీ పాలక మండలి సభ్యులుగా 4 ఏళ్లు కొనసాగారు.

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా రామచంద్రం

కేయూ దూరవిద్య కేంద్రం నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమితులయ్యారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు స్థానంలో ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను నియమించారు. ప్రొఫెసర్ రామచంద్రం కేయూ సైకాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా నరసింహచారి

కేయూ కొత్త పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి నియమితులయ్యారు. ఇప్పటివరకు ప్రొఫెసర్ మల్లారెడ్డి పరీక్షల నియంత్రణాధికారిగా కొనసాగడంతో ఆయన స్థానంలో నరసింహచారిని నియామించారు.

అలాగే కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధుల్లో ఉన్న ప్రొఫెసర్ మంచాల సదానందంను నియమించారు. ఇప్పటివరకు కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మల్లారెడ్డి స్థానంలో సదానందంను నియామించారు. కేయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ పి.అమరవేణి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగిన ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి స్థానంలో అమరవేణిని నియమించారు. సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి నియమితులయ్యారు. ఇప్పటివరకు అమరవేణి ప్రిన్సిపాల్‌గా ఉన్న స్థానంలో వరలక్ష్మిని నియమించారు.

అలాగే వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్‌ను నియమించారు. వీరిఉత్తర్వులను ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు జారీ చేశారు. నూతనంగా పరిపాలన పదవుల్లో నియమితులైన ప్రొఫెసర్లను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

సోనియాను కలిసిన రిజిస్ట్రార్ రవి

వరంగల్ ఎంపీ టికెట్ అభ్యర్థన.. బయోడేటా అందజేత


సోనియాగాంధీతో రవి

హనుమకొండ సిటీ, జనవరి 31: వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీని కలిశారు. వరంగల్ పార్లమెంట్ టికెట్‌ను ఆశిస్తున్న రవి.. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సోనియాను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. శాలువాతో సన్మానించారు. అనంతరం ఆమెకు తన బయోడెటాను అందచేశారు. తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర, ఉద్యోగుల సమస్యలపై పోరాటం, సామాజిక సేవా కార్యక్రమాలు, కరోనా సమయంలో అందించిన సేవలు, నిరుపేద కుటుంబం నుంచి ఉద్యోగపరంగా ఉన్నతాస్థాయికి ఎదిగిన తీరు, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విధానాలను జనంలోకి తీసుకెళ్లడం తదితర అంశాలను సోనియాగాంధీకి వివరించారు. టికెట్ కేటాయిస్తే అందరి సహకారంతో విజయం సాధిస్తానని రవి విన్నవించుకున్నారు. దీనిపై సోనియాగాంధీ స్పందిస్తూ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఏకంగా సోనియాగాంధీనే కలిసి టికెట్ కోసం రవి అభ్యర్థించడం రాజకీయంగా చర్చకు దారి తీసింది.

ఎంపీ టికెట్ కోసం ఆనంద్ దరఖాస్తు

వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయించాలని కోరుతూ హనుమకొండకు చెందిన మోజెస్ ఆనంద్ పాల్ దరఖాస్తు సమర్పించారు. బుధవారం హైదరాబాద్‌లో దరఖాస్తును గాంధీభవన్‌లోని సిబ్బందికి అందచేశారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి చేసిన సేవలు, సామాజిక కార్యక్రమాలతో కూడిన బయోడెటాను సమర్పించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జాతీయస్థాయి ఫెస్ట్‌కు గురుకుల విద్యార్థినుల ఎంపిక

మడికొండ, జనవరి 31: హైదరాబాద్‌లో డిసెంబరు 6న జరిగిన స్టెమ్ స్పార్క్ ఇన్నోవేషన్ ఫెస్ట్-2023-24లో ఫుట్ స్టెప్ ఎలక్ట్రిసిటీ జనరేటింగ్ సిస్టమ్ ప్రాజెక్టులో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 5వ స్థానంలో నిలిచారు. జాతీయస్థాయి స్టెమ్ స్పార్క్‌లో తమ ప్రాజెక్టు ఫుట్ స్టెప్ ఎలక్ట్రిసిటీ జనరేటింగ్ సిస్టమ్‌ను ప్రదర్శించడానికి అర్హత సాధించారు. ఈ ప్రాజెక్టుని ఫిబ్రవరి 1, 2 తేదీలలో బెంగుళూరులోని ఇంటర్‌నేషనల్ సెంటర్‌లో జరగబోయే జాతీయస్థాయి స్టెమ్ స్పార్క్‌లో ప్రదర్శిస్తారు. 10వ తరగతి విద్యార్థినులు శ్రుతి, రమ్యలను వరంగల్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఎస్.విద్యారాణి, మడికొండ ప్రిన్సిపాల్ ఎస్.మల్లారెడ్డి, ఉపాధ్యాయురాలు కె.జ్యోతితో పాటు అధ్యాపక బృందం అభినందించారు.

పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు

గార్ల, జనవరి 31 : గ్రామ పంచాయతీల్లో గతంలో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లింపులు జరుగుతాయని జడ్పీ సీఈవో రమాదేవి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో సర్పంచ్‌లకు వీడ్కోలు పలుకుతూ, సన్మానం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డి.రవీందర్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, సర్పంచ్‌లు అజ్మీరా బన్సీలాల్, వట్టంజానకిరాణి, ఉషాబాలునాయక్, మోతీలాల్ నాయక్, డి.సక్రునాయక్, భూక్యా బుజ్జి, గుగులోత్ తారాబాయి, బూక్యా రాంబాయి, అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

● తొర్రూరు రూరల్ : హరిపిరాలలో గత ఐదేళ్లుగా అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచ్ రావుల మమతారెడ్డి, ఉపసర్పంచ్ చెంచర్ల రాజుతో పాటు పాలకవర్గానికి ప్రజలు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నుకొని గత ఐదేళ్లుగా ప్రజలకు సేవచేసే అదృష్టం కలిపించి, అభివృద్ధికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి దేవయ్య ఎంపీటీసీ వల్లపు గోపమ్మమల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ లింగన్న, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండ వెంకన్న, ప్రధాన కార్యదర్శి మురళి, తోట మురళి, గద్దల బిక్షపతి, ఎస్కె. పాషా, ముత్తయ్య అశోక్, వార్డుసభ్యులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

● దంతాలపల్లి : తానకు గ్రామ ప్రజలకు సేవా చేసే భాగ్యంను గ్రామస్థులు కల్పించారని, వారి ఆదరణను మరువలేనని సర్పంచ్ కొమ్మినేని రవీందర్ అన్నారు. బుధవారం ఆయన గ్రామంలోని బేడ బుడగ జంగాల కాలనీలో తాగునీటి నల్లాను ప్రారంభించారు. అనంతరం జీపీలో ఆయనకు వార్డు సభ్యులు, గ్రామస్థులు ఘనంగా విడ్కోలు పలికారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గత ఇరువై ఏళ్లుగా సర్పంచ్‌గా ఉంటు సమస్యల పరిష్కారంకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజల సహకారంతో ప్రజల మధ్య ఉండి సేవచేశానన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ బోర యాకన్న, వార్డు సభ్యులకు ఘనంగా గ్రామస్థులు సన్మానించారు.



డోర్నకల్ మండల పరిషత్‌లో సర్పంచ్‌లతో అధికారులు



హరిపిరాలలో పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ప్రజలు

● డోర్నకల్ : మండలంలో గత ఐదేళ్లలో ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలందించారని ఎంపీడీవో చలపతిరావు అన్నారు. ఫిబ్రవరి 1తో గ్రామపంచాయతీ పాలకమండలి పదవీకాలం ముగియనుండడంతో మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బాలునాయక్, జడ్పీటీసీ కమల, ఎంపీవో మున్వర్‌బేగ్‌లు పాల్గొన్నారు.

● బయ్యారం : గ్రామాల్లో ఐదేళ్ల పాటు తాము చేపట్టిన ప్రజా సేవలో ప్రజలు తమకు అండగా నిలబడి అందించిన సహకారం జీవితంలో ఎన్నటికి మరువలేనిదని సన్మానగ్రహిత సర్పంచులు అభిప్రాయపడ్డారు. సర్పంచుల పదవీకాలం పూర్తవడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సర్పంచులను శాల్వా, మెమెంటోతో ఘన గా సత్కరించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బిందు, వైస్ ఎంపీపీ తాతా గణేష్, తహసీల్దార్ ఇమానీయల్, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డితో పాటు సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీపీ భవనం ప్రారంభం



నూతన జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బి.సరోజ కిషన్‌నాయక్, వైస్ ఎంపీపీ దేవేందర్

నర్సింహులపేట : నూతనంగా ఏర్పాటైన గోల్‌బోడ్కాతండా గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ బాదావత్ సరోజ కిషన్‌నాయక్ ప్రారంభించారు. 2022-23 సంవత్సరానికిగాను నూతన భవనం నిర్మాణానికి ఏటూరునాగారం ఐటీడీఏ గ్రాంట్ (ఎస్టీ-ఎస్‌డీఎఫ్) నిధుల నుంచి రూ. 20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ధన్‌సింగ్‌తండలో తమ అత్తమామలైన బాదావత్ వెంకట్రాం బంగారమ్మ జ్ఞాపకార్థంగా సుమారుగా రూ.20 లక్షల భూమి 0.20 గుంటలు ఉచితంగా జీపీ భవనం నిర్మాణం పనులు ప్రారంభించి పూర్తి చేశామన్నారు. వైస్ ఎంపీపీ జాటోతు దేవేందర్‌తో కలిసి జీపీ భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తొర్రూరు ఏఎంసీ మాజీ చైర్మన్ టీకుల యాదగిరిరెడ్డి, ఉప సర్పంచ్ భూక్యా భారతి, వార్డుసభ్యులు వేవిసంగ్, శిరీష, సరోజ, బీబీ, అమ్మీ, వెంకన్న పాల్గొన్నారు.

'రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం'

కేసముద్రం, జనవరి 31 : రైతుల కోసం పనిచేసేదే కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం విలేజిలో రూ.44లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన సొసైటీ భవనం, గోదాంలను, కల్వలలో అంగన్‌వాడీ భవనం, స్మశానవాటికను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు 24 గంటల కరెంటు, ఎస్ఆర్ఎస్‌పీ నీళ్లను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు మార్నేని రవీందర్, డీసీవో ఖుర్షిద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మర్రి రంగారావు, సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ గంట సంజీవరెడ్డి, ఎంపీడీవో రవీందర్‌రావు, పొలెపల్లి వెంకట్‌రెడ్డి, గండి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు సంక్షేమ పథకాలు

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. బోడగుట్టతండలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే మాట్లాడారు. బోడగుట్టతండలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన జీపీ భవనంను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. సర్పంచ్ అజ్మీర సత్తెమ్మ, ఉపసర్పంచ్ సుందర్, మండల పార్టీ అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, రవీంద్రాచారి, అజ్మీర సురేష్, పీఆర్ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటతడి పెట్టిన ఎమ్మెల్యే..



కల్వలలో కంటతడి పెట్టుకుంటున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం : మండలం కల్వల గ్రామపంచాయతీ పాలకమండలి పదవీవిరమణ సభలో ఎమ్మెల్యే మురళీనాయక్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ సర్పంచ్ గంట సంజీవరెడ్డి అంటే గ్రామ ప్రజలు ఎంతో అభిమానం చూపుతారని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇక నుంచి కల్వల గ్రామానికి తాను వచ్చిన సమయంలో ఆయన సర్పంచ్‌గా లేరనే విషయాన్ని తనను చాలా బాధకు గురిచేస్తోందని అంటూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి..

(5వ పేజీ తరువాయి)

కళాకారులు, మేధావులు, ఉద్యమకారులను జైళ్లలో పెట్టించారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమకారులైన వరవరరావు, సాయిబాబలు అనారోగ్యంగా ఉన్నా జైళ్లో పెట్టించి చిత్రహింసలు పెట్టారని గుర్తు చేశారు. సనాతన ధర్మంతో మహిళలను కట్టిపడేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. చర్చల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

అంతకుముందు ములుగురోడ్డు నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా సీఐటీయూ కార్యదర్శి ఏఆర్ సింధూ, రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ఆల్ ఇండియా కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాస్కర్, రాష్ట్రకార్యదర్శులు జి.వెంకటేశ్, రాగుల రమేష్, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రజిత, బొట్ల చక్రపాణి, చుక్కయ్య, వాసుదేవరెడ్డి, మంద సంపత్, పెండ్యాల రవీందర్, జి.వెంకట్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలి'



బాలునాయక్‌ను సన్మానిస్తున్న సంఘం నేతలు

సీరోలు, జనవరి 31 : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు బదిలీలు కూడా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ సంఘం (టీఎస్-యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీరోలులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సంఘం రెండో మండల మహాసభను శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం బదిలీపై వెళ్లిన మండల అధ్యక్షుడు బాలునాయక్‌ను సన్మానించారు. నాయకులు మంజుల, వివేక్, కృష్ణాకర్, భాస్కర్, శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య, మంజుల, రమ్య, శ్రీలక్ష్మీ, శాంతకుమారి, సరిత, షాహిన్ అప్సర్, కల్పన, శోభ పాల్గొన్నారు.

'అధికారులు పారదర్శకంగా పనిచేయాలి'



బయ్యారంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బిందు



పాటిమీదితండా సర్పంచ్ రాధానర్సింగహనాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, జనవరి 31 : అధికారులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనిచేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బానోత్ సుజాతమోతీలాల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ గ్రామాలలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కరించాలన్నారు. కాగా, మండలంలో సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో పాటిమీది తంబి సర్పంచ్ బానోత్ రాదానర్సింహనాయక్‌తో పాటు పలువురు సర్పంచులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. పాటిమీదితండాలో మద్యపాన నిషేధం అములు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్, జడ్పీ కోఆప్షన్ ఖాసీం, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు వేం వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ కత్తిస్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● బయ్యారం : వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బిందు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా హాజరైన బిందు మాట్లాడుతూ సమన్వయంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించగా, సభ్యులు పలుఅంశాలపై ప్రశ్నించారు. వైఎస్ ఎంపీపీ తాతా గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బిందు, పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, తహసీల్దార్ ఇమ్మానీయల్, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు షేక్‌బాబా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● పెద్దవంగర : అధికారులు, ప్రజాప్రతినిధులు మధ్యపరస్పర సహకారం ఉంటేనే మం డలాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంను ఎంపీపీ అధ్యక్షతన సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌లను అభినందించారు. అనంతరం సర్పంచ్‌లకు వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితారెడ్డి, ఏఈలు యాకుబ్, ప్రసన్నకుమార్, ఆర్ఐ లష్కర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే గంట్లకుంటలో జడ్పీటీసీ శ్రీరాంజ్యోతిర్మయి సుధీర్‌తో పాటు సర్పంచ్ చింతల భాస్కర్‌రావుతో కలిసి ప్రారంభించారు.

'పీడీత ప్రజల గుండెచప్పుడు గద్దర్'

మహబూబాబాద్ టౌన్, జనవరి31 : తన తుదిశ్వాస విడిచేంత వరకు పాటే ప్రాణంగా పేదల కోసం ఉద్యమించిన పీడీత ప్రజల గుండెచప్పుడు ప్రజాయుద్ధనౌక గద్దర్ అని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రజాకవి గద్దర్ జయంతిని నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ప్రజాసంఘాల నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, హరినాయక్, దుడ్డెల రామ్మూర్తి, బెజ్జం ఐలేష్, పోలెపాక వెంకన్న, బానోత్ హుస్సేన్ నాయక్, చంటి, బలరాజు, బిక్షపతి, అనిల్, రామ్మూర్తి పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజావేదికలో డబ్బుల రికవరికి ఆదేశాలు

దంతాలపల్లి, జనవరి 31 : సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం నిర్వహించిన జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.1,89,488 లక్షలకు జిల్లా అదనపు డీఆర్డీవో శాంతాకుమారి రికవరికి ఆదేశించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 27 నుంచి గ్రామ స్థాయిలో జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు గాను చేపట్టిన ఇంటింటా సర్వేలో గ్రామ సభను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రెండోవిడతలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో (ఎన్ఆర్ఈజీఎస్)వివిధ గ్రామాల్లో ఫీల్డ్అసిస్టెంట్, పంచాయతీ కార్యర్శి, టెక్నికల్ అసిస్టెంట్‌తో పాటు ఈసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీవోలకు గాను ఆగపేటలో 16,325, బీరిశెట్టిగూడెం రూ.4,080, బొడ్లాడ రూ.2,500, దంతాలపల్లి రూ.4,511, దాట్లలో రూ.11,893, దొనకొండలో రూ.6,668, గున్నేపల్లిలో రూ. 8,857, కుమ్మరికుంట్లలో రూ.4,904, లక్ష్మీపురంలో రూ.5,913, నిదానపురంలో రూ.5,946, పెద్దముప్పారంలో రూ.16,535, రామానుజపురంలో రూ.2,626, రామవరంలో రూ.5,005, రేపోణిలో రూ.22,833, తూర్పుతండాలో రూ.32,537, వాల్యతండాలో రూ.8,557, వేములపల్లిలో రూ.10,210 చొప్పున అదనపు డీఆర్డీవో శాంత కుమారి పై సిబ్బందిలకు జరిమానాతో పాటు రికవరికి ఆదేశించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫీల్డ్అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనులు చేయాలన్నారు.

ఈకార్యక్రమంలో ఎంపీపీ వల్లాద్రి ఉమా, జడ్పీవైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, అంబుడ్స్‌మ్యాన్ బి.అదమ్, ఏపీవో యాకయ్య, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో అప్సరపాషా, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'లయన్స్‌క్లబ్' అన్నదానం

కేసముద్రం, జనవరి 31 : కేసముద్రం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హంగర్ రిలీఫ్ ప్రోగ్రాంలో భాగంగా నెల రోజుల పాటు చేపట్టిన అన్నదానం కార్యక్రమం బుధవారం నాటితో ముగిసింది. చివరి రోజు స్థానిక వ్యవసాయ మార్కెట్లో క్లబ్ పాస్ట్ సెక్రటరీ లక్కాకుల సత్యనారాయణ, వినోద దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు కేసముద్రం, ఇనుగుర్తి, నెక్కొండ మండలాల్లోని పలు గ్రామాల్లో రూ.1.50లక్షలతో 6వేల మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.చంద్రశేఖర్, యర్రం శ్రీరాములు, బోగోజు నాగేశ్వరాచారి, చింతా కరుణాకర్, మారం సమ్మిరెడ్డి, కట్కూరి శ్రీనివాస్, గార్లపాటి ప్రమోద్, కొడకండ్ల ప్రభాకర్, మడిపెద్ది వెంకటేష్, సట్ల గోపి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుభిక్షమైన పాలన

మరిపెడ రూరల్, జనవరి 31 : సుభిక్షమైన పాలన కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు మాలునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి శివారు జర్పుల తండాలో 60 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ జెండాలను కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ కురువృద్దుడు, వరంగల్ మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి, ఆశీస్సునలతో, విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, జిల్లా నాయకుడు యుగేందర్‌రెడ్డి నాయకత్వంతో రానున్న ఎంపీ ఎన్నికలలో భారీ మోజార్టీతో గెలిపిస్తామన్నారు. రమేష్‌నాయక్, జె.కసంజి, వెంకన్న, లచ్చిరాం, లచ్చు, గిన్న, దేవల, మోతి, రాజా పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

తొర్రూరు, జనవరి 31 : దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను ప్రతి ఘటించేందుకు చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని ఐయఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెనోటీసును కమిషనర్ సరస్వతికి అందించి, మాట్లాడారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము దేవేందర్, బీకు, ప్రసాద్, వెంకట్రాంనర్సయ్య, మహేందర్, వెంకన్న, రాజశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

జోడోయాత్రను అడ్డుకోవడం సిగ్గుచేటు

తొర్రూరు, జనవరి 31: దేశ సంక్షేమం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో న్యాయయాత్రను అడ్డుకోవడం సిగ్గు చేటని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, సోమరాజశేఖర్ అన్నారు. బుధవారం తొర్రూరులోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు పెదగాని సోమయ్య శ్యామ్‌సుందర్‌రెడ్డి, సదాకర్, దారావత్ సోమన్న, మేరుగు మల్లేశం, వెంకన్న, రాంబాబు, రవి, శ్రీను, మహేందర్ పాల్గొన్నారు.

విత్తనాల దుకాణం ఎదుట రైతుల ఆందోళన

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 31 : మానుకోటలోని కిసాన్ అగ్రిమాల్ ఎరువుల, విత్తనాల దుకాణంలో కొనుగోలు చేసిన మొక్కజొన్న విత్తనాలు వేస్తే అవి ఏపుగా.. గుబురుగా పెరగడంలేదని, దాంతో దిగుబడిరాదని ఆరోపిస్తూ.. తమకు న్యాయం చేయాలంటూ శనిగపురం గ్రామానికి చెందిన మాలోతు విజయ్‌తో పాటు మరి కొంతమంది రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణకు పిర్యాదు చేయడంతో మండల వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కిసాన్ అగ్రిమాల్‌లో ఓ కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలు పలు దఫాలుగా ఆరు ప్యాకెట్లు ఖరీదు చేశామని, తమ వ్యవసాయ భూమిలో విత్తుకున్నామన్నారు. అయితే మొదటి దఫా వేయడంతో అవి సరిగ్గా మొలవలేదని, మళ్లీ రెండోసారి కూడా విత్తనాలు ఖరీదు చేసుకుని విత్తనాలు వేశామని చెప్పారు. అయితే మొక్కలు పెరుగుతున్న కొద్ది ఏపుగా, గుబురుగా, బలంగా పెరగడం లేదని, దాంతో కంకులు సరిగ్గా పెట్టవని ఆరోపించారు. దాంతో ఆ రైతులు జిల్లా వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు. దాంతో వ్యవసాయాధికారి షాపు వద్దకు వెళ్లి ఆ షాపుకు లైసెన్స్ ఉందా..! ప్రభుత్వం ఆమోదం పొందిన విత్తనాలే అమ్ముతున్నారా? అనే విషయాలపై విచారణ జరిపారు. గురువారం ఆ రైతు గ్రామానికి వెళ్లి మొక్కజొన్న చేనును ప్రత్యక్షంగా చూసి పూర్తిస్థాయి విచారణ చేపడుతామని చెప్పారు.

పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి

తొర్రూరు, జనవరి 31 : తొర్రూరు పట్టణ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని పలువార్డుల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వచ్చే ఎండాకాలంలో తాగునీటికి సమస్యలు రాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ సరస్వతి, మేనేజర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులివ్వాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 31 : స్వరాష్ట్రం కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత నివ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ ధరంసోత్ నారాయణసింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్రమంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను బుధవారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందించారు. మంత్రులను కలిసిన వారిలో ఫోరం నాయకులు భాను వెంకన్న, భూక్య రమేష్, జి. దక్షిణామూర్తి, లింగంపల్లి సతీష్, బత్తుల కుమార్ ఉన్నారు.

కోదండరాంను అడ్డుకోవడం సిగ్గుచేటు

● టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీజేఎస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 31 : తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా గవర్నర్ ఆమోదించినప్పటికి మాజీసీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ అడ్డుకోవడం సిగ్గుచేటని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్ శ్రీవివేకానందసెంటర్‌లో తెలంగాణ జనసమితి (టీజేఎస్) ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టి మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లి సుధాకర్, ఆరుద్ర పరమాత్మాచారి, ఇరుగు మనోజ్‌కుమార్, ఖాజాపాషా, గణేష్, శంకర్, ప్రసాద్, రవి, నాగయ్య, అనిల్ పాల్గొన్నారు.

దాడి చేసి, గాయపర్చిన కేసులో నలుగురికి జైలు

మరిపెడ, జనవరి 31 : దాడిచేసి గాయపర్చిన కేసులో నలుగురు వ్యక్తులకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తొర్రూరు కోర్టు న్యాయాధికారి మట్ట సరిత గురువారం తీర్పు వెల్లడించారు. ఈ కేసు పూర్వపరాలను మరిపెడ ఎస్సై ఎస్కే.తహెర్ స్థానిక విలేకరులకు వివరించారు. 2016 సంవత్సరంలో మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధి ఆముదాలగడ్డ తండాకు చెందిన మాలోత్ తులస్యా పంట చేనులోని ఓ వేప చెట్టును అదే తండాకు చెందిన మాలోత్ జగన్, కస్యా, సింగన్న, శంకర్ నరికి వేసి, తులస్యా కుటుంబీకులపై దాడికి దిగారు. అప్పటి ఎస్సై బాబులాల్ నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖాలు చేశారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.గణేశ్ఆనంద్ వాదించగా, సాక్షులను కోర్టు కానిస్టేబుల్ రాంనారాయణ న్యాయాధికారి ఎదుట హాజరు పర్చారు. వాదోపవాదనలు పరిశీలించిన తొర్రూరు కోర్టు న్యాయాధికారి ఆ నలుగురికి జైలు శిక్ష విధించారని ఎస్సై పేర్కొన్నారు.

పార్లమెంటరీ సీటు కోసం రాయపురం దరఖాస్తు



గాంధీభవన్‌లో ఎంపీ సీటు కోసం దరఖాస్తు చేసుకుంటున్న సాంబయ్య

మహబూబాబాద్ టౌన్, జనవరి 31 : మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎంపీగా తనకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడు రాయపురం సాంబయ్య విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ కాంగ్రెస్‌లో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నానని తనకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు.

'పగిడిద్దరాజు ఆలయానికి మౌళిక వసతులు కల్పించాలి'

గంగారం, జనవరి 31 : పూనుగొండ్లలో కొలువైన పగిడిద్దరాజు ఆలయానికి మౌళిక వసతులు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు బూర్క యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తుడుందెబ్బ బృందం ఆలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవమైన సమ్మక్క పెనిమిటి పగిడిద్దరాజు ఆలయం అభివృద్ధికి అధికారులు నిధులు కేటాయించాలని కోరారు. భక్తులు ఉండేందకు షెడ్‌లు నిర్మాణం చేయాలని వారు కోరారు. సువర్ణపాక వెంకటరత్నం పాల్గొన్నారు.

మహా శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల టెండర్లు ఖరారు

కురవి(మహబూబాబాద్ జిల్లా), జనవరి 31 : త్వరలో జరుగబోయే కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించే వివిధ ఏర్పాట్లకు టెండర్లు ఖరారైనట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు. శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం బ్రహ్మోత్సవాల వేడుకలకు అవసరమైన ఏర్పాట్ల పనులకు సంబంధించిన టెండర్లను పూర్తి చేసినట్లు సత్యనారాయణ చెప్పారు. ఇందులో 10 పనులకు గాను రూ.1.60 లక్షలకు టెండర్లు దక్కించుకున్నట్లు తెలిపారు. కాగా, తలనీలాలకు సంబంధించిన టెండరు, కొబ్బరికాయల టెండరు ఖరారు కాలేదన్నారు.

మండల ప్రత్యేక అధికారులు వీరే

గంగారం, జనవరి 31 :సర్పంచుల పదవీ కాలం గురువారం ముగుస్తుండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీలకు ప్రత్యేక అధికారులను ఎంపీడీవో అపర్ణ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బావురుగొండకు అటవీ సెక్షన్ అధికారి లక్ష్మణ్, చింతగూడెంకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సతీష్, దుబ్బగూడెంకు ఏఈవో కిషోర్, గంగారంకు ఎంపీవో సత్యనారాయణ, జంగాలపల్లికి ఎఫ్ఎస్‌వో రామదాసు, కామారంకు తహసీల్దార్ రాము, కొడిశెలమిట్టకు డీటీ పద్మావతి, కోమట్లగూడెంకు ఎంపీడీవో అపర్ణ, మడగూడెంకు ఎఈవో మునిప్రసాద్, మర్రిగూడెంకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ రామలక్ష్మీ, పూనుగొండ్లకు ఏఈవో అంకుసలి, తిరుమలగండికి ఏఈ విజయ్‌లను నియమించారు.